విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



| హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 200 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జనవరి 2025 | వెల : రూ 10/- |
|---|---|---|---|---|---|



## నేటి నుంచి సంక్రాంతి సెలవులు

### మళ్లీ 18వ తేదీన తెరుచుకోనున్న బడి తలుపులు

హైదరాబాద్,
తెలంగాణలో సంక్రాంతి పండుగ హడావుడి మొదలైంది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఎందుకంటే రేపట్నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు కాబట్టి. స్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై పాఠశాలలకు వెళ్లారు. రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలలకు జనవరి 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు.

-మిగతా 3 లో





## సాగుయోగ్యమైన భూమికే


# రైతు భరోసా

### 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

- అనర్హులకు పథకాలు అందకుండా చూడాలి
- ప్రభుత్వ పథకాలకు పూర్తి బాధ్యత మీదే
- ప్రజల్లోకి వాటిని సక్రమంగా తీసుకు వెళ్లాలి
- గ్రామసభలు నిర్వహించి పక్కగా అమలు చేయాలి
- అభివృద్ధి,సంక్షేమం మాకు రెండు కళ్లు
- కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు

హైదరాబాద్,
ఈనెల 26 నుంచి రైతుభరోసా, 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. పథకాలను

-మిగతా 3 లో



## రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల

- తెలంగాణకు రూ.3,637
- ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,002 కోట్లు

న్యూఢిల్లీ,
దేశంలోని వివిధ రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త చెప్పింది. పన్నుల్లో వాటా కింద తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు నిధులను విడుదల చ ఏసింది. దేశంలోని 28 రాష్ట్రాలు/యూటీలకు కలిపి జనవరి నెలకు మొత్తం

-మిగతా 3 లో




## కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒక్కటే

- ఫార్ములా రేస్ కేసులో నిధులు ఎందుకు బదలాయించారు
- 700 కోట్లు ఎ క్కడ లాభాలు వచ్చాయో కెటీఆర్ చెప్పగలడా
- కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటు విమర్శలు

కరీంనగర్,
ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ అరెస్ట్ అయితే ఆందోళనలు ఎందుకు చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. కేటీఆర్ ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా అని ప్రశ్నించారు.

-మిగతా 3 లో



## ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ దూకుడు


-హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి విచారణ
-నిధుల విడుదలకు అనుమతులపై ప్రశ్నలు

హైదరాబాద్,
ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి ఏసీబీ విచారణ కొనసాగింది. శుక్రవారం దాదాపు 6 గంటలుగా బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ రికార్డులను పరిశీలించిన ఏసీబీ అధికారులు వాటిని బీఎన్ఎల్ రెడ్డి ముందు

-మిగతా 3 లో

## గత పాలనలో అన్ని

# రంగాల్లో పతనావస్థ



- రాష్ట్రాన్ని సమస్యల వలయంగా మార్చేశారు
- బ్రాండ్ ఎపికి మళ్లీ మహర్దశ పట్టిస్తున్నాం
- నిర్మాణరంగానికి ప్రత్యేక ప్రోత్సాహం
- నరెడ్కో ప్రాపర్టీ షోలో సిఎం చంద్రబాబు నాయుడు

గుంటూరు,
గత పాలకులు అన్ని రంగాలనూ పతనావస్థకు తీసుకొచ్చారని.. రాష్ట్రాన్ని సమస్యల వలయంగా మార్చేశారని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. పడకేసిన నిర్మాణ రంగాన్ని మళ్లీ పైకి తీసుకొస్తామన్నారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య మైదానంలో నరెడ్కో ప్రాపర్టీ షోను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన

-మిగతా 3 లో




## చలికి వణుకుతున్న ఉత్తరాది రాష్ట్రాలు

- ఉదయం వేళల్లో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేని స్థితి
- వరుసగా చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు

న్యూఢిల్లీ,
చలి తీవ్రతకు ఉత్తరభారతం వణుకుతోంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు యూపీ, పంజాబ్, జార?ండ్, పశ్చిమబెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు

-మిగతా 3 లో



## లొట్టపీసు కేసులో కేటీఆర్ అరెస్ట్ అయితే..?

- పార్టీని ముందుకు తీసుకెళ్లేదెవరో..
- పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న చర్చ ఇదే
- పెద్దాయన ఫామ్‌హౌజ్ వీడి వస్తారా అన్నది అనుమానమే

హైదరాబాద్,
బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్ కుటుంబ సభ్యులు, బంధువుల పార్టీ అన్నది జగమెరిగిన సత్యం. పార్టీ అంతా కెసిఆర్, కెటిఆర్, కవితల ఆధ్వర్యంలో నడుస్తుంది. పైకి హరీష్ రావు కనిపిస్తున్నా..ఆయనది నిమిత్తమైన పాత్ర. ఆయన గగ్గోలు బ్యాచ్‌లో ఉంటారు. అందుకే కేటీఆర్‌పై కేసు నమోదు కాగానే అడ్డదిడ్డమైన వాదనలు, అరుపులతో గగ్గోలు పెట్టాలని చూశారు. మొత్తంగా గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలుగా పనిచేసి వారంతా వచ్చి

-మిగతా 3 లో

# సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్

23 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్



హైదరాబాద్,
హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్లో భాగంగా రూ. 5.29 కోట్ల మోసాలకు పాల్పడ్డ 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు పోలీసులు. ఈ సైబర్ చీటర్స్ ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో ఉంటూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు పోలీసులు. తెలంగాణలో వీరిపై 30 సైబర్ క్రైమ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు పోలీసులు. పోలీసులు అరెస్ట్ చేసిన కేటుగాళ్లు దేశవ్యాప్తంగా 328 కేసుల్లో నిందితులుగా ఉన్నారని.. ఇన్వెస్ట్మెంట్, డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్, ఏపీకే, జాబ్ ఫ్రాడ్ కేసుల్లో మోసాలకు పాల్పడ్డట్లు తెలిపారు పోలీసులు. 70 ఏళ్ళ బాధిత వృద్ధుడు మొబైల్ హ్యాక్ అయ్యి రూ1.9 కోట్లు మోసపోయాయని ఫిర్యాదు చేయగా.. ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు పోలీసులు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం అంటూ మొబైల్ కి వచ్చే మెసేజ్ లలో ఉన్న లింకులను ఎట్టి పరిస్థితిలో క్లిక్ చేయొద్దని.. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేసి ఓటీపీలు వంటి కీలక సమాచారాన్ని ఇవ్వొద్దని సూచించారు పోలీసులు.

# యూట్యూబర్ ఫన్‌బకెట్ భార్గవ్‌కు 20 ఏళ్ల జైలు

విశాఖ పోక్సో కోర్టు సంచలన తీర్పు



విశాఖపట్నం,
విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. టిక్‌టాక్, యూట్యూబ్ ద్వారా ప్రాచుర్యం పొందిన యువకుడు 'ఫన్ బకెట్' భార్గవ్‌కు 20ఏళ్ల జైలు శిక్ష విధించింది. 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేశాడన్న ఆరోపణలతో భార్గవ్ అరెస్టయిన సంగతి తెలిసిందే. కేసు వివరాల ప్రకారం.. నిందితుడు బాధిత బాలికతో టిక్‌టాక్ వీడియోలు చేస్తూ, ఆమెను బెదిరించి, పదేపదే లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అమానుష చర్య కారణంగా బాలిక గర్భం దాల్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. విశాఖ నగర మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ డాక్టర్ జి.ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించారు. ఛార్జ్‌షీట్‌తో పాటు, సాక్ష్యాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాలను పరిశీలించిన విశాఖపట్నం ప్రత్యేక పోక్సో న్యాయస్థానం నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షను విధించడంతో పాటు, బాధిత బాలికకు నష్టపరిహారంగా రూ.4 లక్షలు చెల్లించాలంటూ ఆదేశించింది

# ఎమ్మెల్సీ ఎన్నికలకు బిజెపి అభ్యర్థుల ప్రకటన

-గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి
-టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య
-మరో అభ్యర్థిగా సర్వోత్తం రెడ్డిల పేర్లు వెల్లడి

హైదరాబాద్,
తెలంగాణలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. అందరి కంటే ముందుగానే మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థి పార్టీలకు బీజేపీ షాక్ ఇచ్చింది. రాష్ట్రంలో రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు




నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్- మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి పేరును బీజేపీ ఖరారు చేసింది. నిజామాబాద్ -అదిలాబాద్- కరీంనగర్- మెదక్-టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కోమరయ్య పేరును ప్రకటించింది. అలాగే వరంగల్- ఖమ్మం-నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సర్వోత్తం రెడ్డిని కాషాయం పార్టీ ప్రకటించింది. అన్ని ప్రధాన పార్టీల కంటే ముందే తమ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ.. ప్రచారంలోనూ దూకుడు పెంచేలా కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మెరుగైన స్థానాలు సాధించడంతో ఎమ్మెల్సీ ఎన్నికలపైనా ప్రస్తుతం ఫోకస్ పెట్టింది. ముందుగానే అభ్యర్థులను ప్రకటించి ప్రజల దృష్టిని ఆకర్షించేలా చేస్తోంది. ఈ మూడు స్థానాలను సైతం కైవసం చేసుకునే దిశగా పావులు కదుపుతోంది. .

# సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై అసంతృప్తి

-ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని హైకోర్టు ఆదేశం
-గేమ్‌ఛేంజర్‌కు ప్రత్యేక అనుమతులపై విచారణ 24కు వాయిదా



హైదరాబాద్,
గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల ధరలు, ప్రత్యేక ప్రదర్శనలపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రత్యేక ప్రదర్శనల అనుమతిపై తెలంగాణ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ పరోక్షంగా ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను ఈనెల 24వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా రిలీజ్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందగా… బాలుడు అస్వస్థతకు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించి అల్లు అర్జున్ జైలుకు వెళ్లి.. బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే తొక్కిసలాట ఘటనను తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై బెన్‌ఫిట్‌షోల కు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. దిల్ రాజు నేతృత్వంలో సినీ పెద్దలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలువగా ఇదే విషయాన్ని తేల్చి చెప్పారు సీఎం. ఇదిలా ఉండగా… శంకర్ దర్శకత్వంలో రాంచరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమా టికెట్‌ల ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అర్ధారత్రి ఒంటి గంటకు బెనిఫిట్ షోలకు అనుమతించని ప్రభుత్వం.. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల షోకు అనుమతినిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ల పెంపు, స్పెషల్ షోలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొందరు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. గురువారం ఈ పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి విచారించగా.. గేమ్ చేంజర్ సినిమా స్పెషల్ షోకు అనుమతి ఇవ్వడంపై పిటిషనర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. టికెట్ పెంపుపై ఉత్తర్వులు ఇవ్వకుండా ఆదేశించాలని హైకోర్టును పిటిషనర్ కోరారు. దీనిపై విచారణను శుక్రవారానికి వాయిదా వేసిన కోర్టు.. నేటి విచారణలో ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తెల్లవారుజామున షోలకు అనుమతి ఇవ్వడంపై పునసమీక్షించాలని హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 24కు హైకోర్టు వాయిదా వేసింది.

# మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్

-మారనున్న మెట్రో ముఖచిత్రం



హైదరాబాద్,
గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్‌ను అనుసంధానం చేస్తూ 36 వరకు రోడ్డు మార్గాలు, నాలుగు చోట్ల రైలు మార్గాలు ఉన్నాయి. రోడ్డు, రైలు మార్గాలతో పాటు మెట్రో మార్గం కలిస్తే భవిష్యత్ ప్రజా రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉండే అవకాశాలున్నాయి. ఆ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి ఉత్తర హైదరాబాద్ వైపు రెండు మెట్రో కారిడార్లు, దక్షిణ హైదరాబాద్ వైపు మరో కారిడార్‌కు డీపీఆర్‌లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మెట్రోరైలు సౌకర్యం ఔటర్ రింగు రోడ్డును దాటి నగర శివారు ప్రాంతాలకు అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు మొదటి దశలోని జేబీఎస్ నుంచి ఎంబీజీఎస్ మార్గంలో 11 కిలోమీటర్లు ప్రస్తుతం నగరవాసులకు అందుబాటులో ఉంది. రెండో దశలో చేపట్టబోయే జేబీఎస-శామీర్‌పేట (22 కి.మీ), ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ), చాంద్రాయణ గుట్ట నుంచి ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా ఆరాంఘర్, శంషాబాద్ టౌన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు (35 కి.మీ), అదేవిధంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ(ఫ్యూచర్ సిటీ) వరకు (40 కి.మీ).. ఇలా మొత్తం 115 కిలోమీటర్ల మెట్రో మార్గం ఉత్తర దిక్కున ఉన్న శామీర్‌పేట ఔటర్ రింగు రోడ్డు నుంచి దక్షిణ దిక్కున ఉన్న ఫోర్త్ సిటీతో అనుసంధానం అవుతుంది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు ఉత్తరాన ఉన్న శామీర్‌పేట నుంచి సికింద్రాబాద్, ముషీరాబాద్, ఎంజీబీఎస్, చార్మినార్ మీదుగా చాంద్రాయణగుట్ట, శంషాబాద్ విమానాశ్రయం అక్కడి నుంచి ఫోర్త్ సిటీ వరకు మెగా మెట్రో కారిడార్ అవతరించనుంది. హైదరాబాద్ మహానగరంలో ఉత్తర-దక్షిణ దిక్కులను కలిపే మెగా మెట్రో కారిడార్‌లో ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్ స్టేషన్‌లు, ఎంఎంటీఎస్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగించే సికింద్రాబాద్, ఫలక్‌నుమా, బుద్వేల్, శంషాబాద్, అల్వాల్, బొల్లారం వంటి రైల్వే స్టేషన్‌లతో అనుసంధానం అవుతుంది. ఇక అత్యంత కీలకమైంది శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం. భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విమానాల నెట్‌వర్క్ కలిగిన విమానాశ్రయంతో కూడా ఈ మెట్రో కారిడార్ కలిస్తే అన్ని రకాల ప్రజా రవాణా వ్యవస్థలు ఒకే మార్గంలో ఉండనున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న ప్రాంతాలను కలపడమే కాకుండా నివాస, వ్యాపార వాణిజ్య కేంద్రాలను, ఔటర్ రింగు రోడ్డు ఇంటర్‌చేంజ్ కేంద్రాలను కలిపేలా మెగా మెట్రో మార్గం అందుబాటుకి వస్తే హైదరాబాద్ మహానగరంలో ప్రజా రవాణా వ్యవస్థ ముఖ చిత్రం సమూలంగా మారిపోనుంది.

# బస్సు టికెట్ ధరకే విమాన ప్రయాణం



హైదరాబాద్,
సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ప్రైవేట్ ట్రావెల్స్‌లో సీట్లు దొరికినా భారీ రేట్లతో జేబులు గుల్లయ్యే పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా రైళ్లు, బస్సుల్లో ప్రయాణానికి సుమారు 10నుంచి 14 గంటల సమయం పడుతుండడంతో కొందరు విమానాలవైపు దృష్టి సారిస్తున్నారు. డిమాండ్ అధికంగా ఉన్న 10,11,12 తేదీల్లో కాకుండా 13వ తేదీన వెళ్లే వారు 1-2 గంటల వ్యవధిలోనే తమ ఊళ్లకు ప్రయాణించేలా విమానయానాన్ని ఎంచుకుంటున్నారు. 13వ తేదీన హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లాలంటే విమానపు టికెట్లు రూ.5వేల నుంచి అందుబాటులో ఉన్నాయి. అయితే, ఒకరోజు ముందు (12వ తేదీన) ఏసీ స్లీపర్ బస్సుల్లో వెళ్లాలంటే రూ.6 వేల నుంచి 7వేల దాకా డబ్బు వెచ్చించాల్సిన పరిస్థితి ఉంటోంది. సీటును బట్టి రేట్లను నిర్ణయిస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు సంక్రాంతి డిమాండును సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా వైజాగ్ ఒక్కటే కాదు.. రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, బెంగళూరు వంటి ప్రాంతాలకు సైతం ఆయా వెబ్‌సైట్‌లలో ఫ్లైట్ టికెట్ల ధరలు తక్కువగా కనిపిస్తున్నాయి. పండగకు వెళ్లేవారు సరిగ్గా ప్లాన్ చేసుకుంటే ఏసీ స్లీపర్ బస్సుకు వెచ్చించే చార్జీలతోనే విమానంలో ప్రయాణం చేయవచ్చని ట్రావెలింగ్ నిపుణులు సూచిస్తున్నారు.

# సాగుయోగ్యమైన భూమికే రైతు భరోసా

(మొదటి తరువాయి)

ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. నాలుగు పథకాల అమలుపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలని.. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కలెక్టర్లకు దిశానిర్ధేశర చేశారు. ఈ మేరకు కలెక్టర్లతో జరుగుతోన్న సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'ఈ నెల 26 తర్వాత జిల్లాల్లో పర్యటిస్తాను. అన్ని జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేస్తా. సాగు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా చెల్లించాలి. పంట వేసినా.. వేయకపోయినా.. సాగుయోగ్యమైన భూమికి రైతు భరోసా ఇవ్వాలి. అనర్హులకు ఇవ్వొద్దు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పర్యటించి అనర్హులను గుర్తించాలన్నారు.. సాగు యోగ్యం కాని భూములను గుర్తించి మినహాయించాలి. స్థిరాస్తి భూములు, లేఅవుట్లు, నాలా కన్వర్షన్, మైనింగ్, గోదాములు నిర్మించిన భూములు, వివిధ ప్రాజెక్టులకు సేకరించిన భూముల వివరాలను సేకరించాలి. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులను క్రోడీకరించుకోవాలి. గ్రామాల మ్యాప్‌లను పరిశీలించి క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకోవాలి. వాటిపై గ్రామ సభల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదని సీఎం వివరించారు. ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోందని.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన కులగణన సర్వే 96 శాతం పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్లకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లేనని అన్నారు. కలెక్టర్ల పనితీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అని తెలిపారు. కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చాం.. కానీ కొంతమంది ఇంకా ఆఫీసులలో కూర్చునే పనిచేయాలని భావిస్తున్నారని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సమస్యలు వచ్చినప్పుడు సమర్ధవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.. మీ పని తీరును మరింత మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మరోవైపు.. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా గతంలో రైతు పెట్టుబడి సాయం అందించారు.. అనర్హులకు రైతు భరోసా ఇవ్వొద్దని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందే.. భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలన్నారు. రాష్ట్రంలో వన్ రేషన్ వన్ స్టేట్ విధానాన్ని తీసుకురాబోతున్నాం.. తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలని సీఎం కలెక్టర్లకు చెప్పారు. ఈ నెల 11 నుంచి15 లోగా పథకాల అమలుకు కావాల్సిన ప్రిపరేటరీ వర్క్ పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్లు అర్హుల జాబితాను ఇంఛార్జి మినిస్టర్ కు అందించాలని సీఎం చెప్పారు. ఇంఛార్జ్ మినిస్టర్ ఆమోదంతోనే కలెక్టర్లు అర్హుల జాబితాను విడుదల చేయాలన్నారు. జనవరి 26న అంత్యంత ప్రతిష్టాత్మక పథకాలను అమలు చేయబోతున్నాం.. ఇందుకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందని, గొప్పగా పనిచేస్తున్నదన్న నమ్మకం ప్రజలకు కలిగించాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా హాస్టల్స్ విజిట్ చేసి రాత్రి బస చేయాలని తెలిపారు. మహిళా అధికారులు బాలికల హాస్టల్స్‌కు వెళ్లి అక్కడి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపండని చెప్పారు. సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోండి.. జనవరి 26 తరువాత తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని అన్నారు. నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి కలెక్టర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు ప్రధాన పథకాలను ఈనెల 26వ తేదీ నుండి అమలుచేయాలని నిర్ణయించామన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒక్కటే

(మొదటి తరువాయి)

అందుకోసం ఏమైనా జైలుకు వెళతారా అని నిలదీస్తూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సర్కార్ సొమ్మును అక్రమంగా కట్టబెట్టి పైగా అడ్డగోలుగా మాట్లాడతవా అని కేటీఆర్ పై సీరియస్ అయ్యారు. కేబినెట్ ఆమోదం లేకుండా విదేశీ కంపెనీకి అంత అర్జెంట్‌గా 55 కోట్లు విడుదల చేయాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. ఫార్ములా ఈ రేస్ తో ప్రభుత్వానికి రూ.700 కోట్లు లాభం వచ్చిందని కేటీఆర్ అంటున్నారు.. మరీ ఆ లాభాలు ఎక్కడ వచ్చాయో చూపించాలని డిమాండ్ చేశారు. లొట్టపీసు సీఎం, లొట్ట పీసు ప్రభుత్వం అని కేటీఆర్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నా.. సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారు..? ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌ను అడ్డగోలుగా తిడుతున్నా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేంటని అన్నారు. ఢిల్లీ వెళ్లి కేసీఆర్ కాంగ్రెస్ హై కమాండ్‌కు కప్పం కడుతున్నందుకే రేవంత్ ఏం చేయలేకపోతున్నారా.. అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని.. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలపై, కేసీఆర్ కుటుంబ అవినీతిపై బీజేపీ రాజీలేని పోరు కొనసాగిస్తోందని ఈ సందర్భంగా బండి సంజయ్ స్పష్టం చేశారు.

# గత పాలనలో అన్ని రంగాల్లో పతనావస్థ

(మొదటి తరువాయి)

మాట్లాడారు. 'కొత్త ఏడాది నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నా. గత ప్రభుత్వ హయాంలో ఈ రంగం అధ్వానంగా మారింది. ప్రజలు మమ్మల్ని నమ్మి 93శాతం స్ట్రయిక్ రేట్‌తో విజయం కట్టబెట్టారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర పునర్ నిర్మాణం ప్రారంభించాం. ప్రధాని మోదీ విశాఖకు వచ్చి రూ.2లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ఇప్పుడిప్పుడే ముందుకెళ్తోంది. నిర్మాణ రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ రంగంపై 34లక్షల మంది ఆధారపడి ఉన్నారు. ఉచిత ఇసుక విధానం తెచ్చి నిర్మాణ రంగానికి ఊతమిచ్చాం. నరెడ్కో, క్రెడాయ్ వంటి సంస్థలు కలిసి ముందుకు రావాలి. రియల్ ఎస్టేట్ సమస్యల పరిష్కారానికి ముందుంటాం. వైకాపా పాలనలో అన్నింటికంటే ఎక్కువగా నిర్మాణ రంగం దెబ్బతింది. అధికారంలోకి రాగానే ఈ రంగానికి ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు. ఎప్పుడూ చూడనివిధంగా భూ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయి. వైకాపా ప్రభుత్వం చేసిన అక్రమాలే దీనికి ముఖ్య కారణం. భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వ నిర్వాకంతో టీడీఆర్ బాండ్లు తీసుకుని కొంతమంది నష్టపోయారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ సాధన కోసం కృషి చేస్తున్నాం. మేం వచ్చాక రూ.4లక్షల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేశాం. ఐదేళ్లలో 20లక్షల మందికి ఉపాధి కల్పించాలనేదే మా లక్ష్యం' అని చంద్రబాబు అన్నారు. ఉచిత ఇసుకతో నిర్మాణ రంగానికి ఊతమిచ్చామన్నారు. నిర్మాణ రంగం నిరంతరం జరిగే పక్రియ అని సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. నరెడ్కో, క్రెడాయ్ వంటి సంస్థలు ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపు నిచ్చారు. రియల్ ఎస్టేట్ రంగంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. వైసీపీ పాలనలో నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. నిర్మాణ రంగానికి తాము ఊతమిచ్చామని ఆయన వివరించారు. శుక్రవారం గుంటూరులో నరెడ్కో ప్రాపర్టీ షోను సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో అన్ని రంగాలు పతనావస్థకు చేరాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్టాన్ని సమస్యల వలయంగా మార్చేశారంటూ గత ప్రభుత్వంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పడకేసిన నిర్మాణ రంగాన్ని మళ్లీ పైకి తీసుకురావాల్సి ఉందన్నారు. కొత్త ఏడాదిలో నిర్మాణ రంగం అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ రంగం అధ్వానంగా ఉందని గుర్తు చేశారు. ప్రజలు తమను నమ్మి 93 శాతం స్ట్రైక్ రేట్‌తో భారీ విజయం కట్టబెట్టారన్నారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర పునర్ నిర్మాణాన్ని ప్రారంభించామని ఆయన స్పష్టం చేశారు. అందులోభాగంగా రూ. 2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ.. తాజాగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారని చెప్పారు. బ్రాండ్ ఏపీ ఇప్పుడిప్పుడే ముందుకెళ్తోందన్నారు. బ్రాండ్ ఏపీ ఇప్పుడిప్పుడే ముందుకెళ్తోందన్నారు. భూ కబ్జాకారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా భూ సమస్యల దరఖాస్తులు తమకు వస్తున్నాయని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అక్రమాలే భూ సమస్యలకు ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. వైసీపీ నిర్వాకంతో టీడీఆర్ బాండ్లు తీసుకుని నష్టపోయారన్నారు. స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంటు సాధన కోసం కృషి చేస్తున్నామని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత.. 4 లక్షల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేశామన్నారు. ఈ ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.


# లొట్టపీసు కేసులో కేటీఆర్ అరెస్ట్ అయితే..?

(మొదటి తరువాయి)

తమ సానూభూతి ప్రకటించి, దారాన్ని తాడులా పేనినట్లుగా ఒక్కటి కావాలనే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో భూకంపం వచ్చిందన్న భ్రమలు కలగించే పరిస్థితి ఉన్నట్లుగా చూపిస్తున్నారు. ఈ క్రమంలో కెసిఆర్ ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావడం లేదు. ఒకవేళ కెటిఆర్ అరెస్ట్ అయితే పార్టీని ఎవరు నడిపిస్తారన్న చర్చ సాగుతోంది. ఎందుకంటే నేరుగా హరీష్ రావు చేతిలో పగ్గాలు పెట్టడం ఆ ఇంటి పెద్దలకు ఇష్ట లేదు. కెటిఆర్ పరోక్షంలో బీఆర్ఎస్ పార్టీని ఎవరు నడిపించాలనే దానిపై కేసీఆర్ కూడా చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. ఫార్మూలా ఈ రేస్ కేసులో ప్రభుత్వం వద్ద ఇప్పటికే అనేక బలమైన సాక్ష్యాధారాలు ఉన్నాయి. ఈ కేసు ఊరికే ముగిసేది కాదు. దర్యాప్తు జరుగుతూ పోతుంటే, మరిన్ని కొత్త విషయాలు బయటకు వచ్చేట్లున్నాయి. ఇలాంటి స్థితి కనిపిస్తున్న సందర్భంలో కేటీఆర్ చాలా అసహనానికి గురవుతున్నారని ఆయన ఎదురుదాడి విమర్శను బట్టి అర్థం చేసుకోవచ్చు. పైసా అవినీతి జరగలేదు..ప్రభుత్వ పరంగా జరగాల్సిన విచారణలో అవినీతి ఎక్కడుందని, ఇంకా గట్టిగా వాదిస్తూ.. లొట్టపీసు కేసు అని పదేపదే చెబుతున్నారు. ఇది ఆయనలోని అసహనాన్ని బయటపెడుతున్నాది. ఆయన లాయర్లు ఇది లొట్టపీసు కేసు కదని చెప్పే ఉంటారు. పదేపదే ఇదే పదం వాడుతూ, సిఎం ర ఏవంత్ రెడ్డిని కూడా అనరాని మాటలతో విమర్శలు చేస్తూ.. తనలోని ఇకపోతే÷–స్టేషన్‌ను బయటపెట్టుకుంటున్నారు. వందిమాగధులు చేరి, ఎంతగా ఎదురుదాడికి పూనుకున్నా ఈ లొట్టపీసు గట్టి కేసు అని మున్ముందు రుజువు కాబోతున్నదనడంలో సందేహం అక్కర్లేదు. కపోతే ఈ లొట్టపీసు కేసులో 'విదేశీ కంపెనీకి పురపాలకశాఖ నేరుగా నిధులు చెల్లిస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయిన కేటీఆర్‌కు తెలియంది కాదు. కెటిఆర్ కూడా మళ్లీ తామే అధికారంలోకి వచ్చేది కనుక ఏమీ కాదన్న ధోరణిలో అతి విశ్వాసంతో ,,,అంతా తాను చూసుకుంటానని ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు భరోసా ఇచ్చి వుంటారు.

# రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల

(మొదటి తరువాయి)



రూ.1,73,030 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో తెలంగాణకు రూ.3,637 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,002 కోట్లు ఇచ్చింది. మూలధన వ్యయం, అభివృద్ధి, సంక్షేమానికి నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొంది. కాగా.. గత నెల(డిసెంబర్)లో రూ. 89,086 కోట్లను పన్నుల్లో వాటా కింద రాష్ట్రాలకు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.

# నేటి నుంచి సంక్రాంతి సెలవులు



(మొదటి తరువాయి)

18వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఇక జూనియర్ కాలేజీలకు జనవరి 11 నుంచి 16 వరకు సెలవులు ప్రకటించారు. 17న పునఃప్రారంభం కానున్నాయి. సెలవు దినాల్లో ఎట్టి పరిస్థితుల్లో కూడా తరగతులు నిర్వహించకూడదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలను హెచ్చరించింది. ఇంటర్ బోర్డు నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# చలికి వణుకుతున్న ఉత్తరాది రాష్ట్రాలు

(మొదటి తరువాయి)

పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. ఆయా ప్రాంతాలను దట్టమైన పొగ కమ్మేసింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. ఈ క్రమంలో పొగమంచు కారణంగా ఢిల్లీ లఖ్‌నవూ జాతీయ రహదారిపై అరడజనుకుపైగా వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. శుక్రవారం ఉదయం ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఫలితంగా దృశ్యమానత దారుణంగా పడిపోయింది. కొన్ని ఏరియాల్లో విజిబిలిటీ జీరోగా నమోదైంది. ఈ కారణంగా ముందు వెళ్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. ఫలితంగా ఇవాళ ఉదయం ఢిల్లీ లఖ్‌నవూ జాతీయ రహదారిపై ఆరుకుపైగా కార్లు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఆ కార్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడినట్లు సమాచారం. ఆ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రంగంలోకి దిగిన అధికారులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ దూకుడు

(మొదటి తరువాయి)




ఉంచి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. హెచ్ఎండీఏ బోర్డు ఖాతా నుంచి ఎఫ్ఈవోకు రూ.55 కోట్లు రిలీజ్ చేయడంలో బీఎల్ఎన్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. ఈ మేరకు నేడు విచారణ చేపట్టింది. అయితే ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఆదేశాలతోనే నగదు రిలీజ్ చేసినట్లు విచారణలో బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాను ప్రొసీడింగ్స్ అన్ని పూర్తి చేశానని రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. ఇందులో తన సొంత ప్రయోజనాలు ఏమీ లేవని ఏసీబీ అధికారులకు బీఎల్ఎన్ రెడ్డి వివరించినట్లు సమాచారం. ఒకవైపు మంత్రి కేటీఆర్.. మరోవైపు పైఅధికారి ఒత్తిడి వల్లే రూ.55 కోట్లకు సంబంధించి తాను ప్రొసీడింగ్స్ చేసినట్లు బీఎల్ఎల్ రెడ్డి విచారణలో చెప్పారు. నగదు బదిలీ చేస్తే భవిష్యత్తులో ఇరుక్కుపోతామని తనకు ముందే తెలుసని ఏసీబీ అధికారులకు బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. అయినా అప్పటి పరిస్థితుల వల్లే నిబంధనలకు విరుద్ధంగా ముందుకు వెళ్లాల్సి వచ్చినట్లు చెప్పినట్లు సమాచారం. తాను ఏసీబీ విచారణకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని, ఈడీ అడిగిన ప్రశ్నలనే మీరూ అడుగుతున్నారని ఏసీబీ అధికారులకు ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. ఈడీ అడిగిన ప్రశ్నలన్నిటికీ తాను సమాధానం ఇచ్చానని, ఏసీబీ విచారణలో బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది.

## సంపాదకీయం

# గగ్గోలు పెడితే..అబద్ధాలు నిజాలు కావు !

తప్పు చేయలేదు..కానీ వేలకోట్ల ఆస్తులు మాత్రం సమకూరాయి. భూములన్నీ హాంఫట్ అయ్యాయి. ధరణి పేరుతో పేదలను జలగల్లా పీల్చారు. పథకాల పేరుతో డబ్బులు పందేరం చేశారు. సిరిసిల్లలో 2500 ఎకరాల ప్రభుత్వ భూమి అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టారు. ఇదంతా యువరాజా వారు కెటిఆర్ అవినీతిపై పుంఖానుపుంఖాలుగా వస్తున్న ఆరోపణలు. చెల్లెలు కవితమ్మ కూడా అవినీతి చేయలేదు. కానీ లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కుని జెయిల్‌కు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. చూస్తుండగానే కాళ్లకుచెప్పులు లేని వారు కోట్లకు పడగలెత్తారు. తెలంగాణలో వీరి కుటుంబం కోట్లకు పడగలెత్తింది. దీనికి సమాధానం లేదు. ఇప్పుడు ఫార్ములా-ఇ రేస్ కేసు మలుపుల మీద మలుపులు తిరుగుతూ పవర్‌ఫుల్ యాక్షన్ మూవీని తలపిస్తోంది. మాజీ మంత్రి కేటీఆర్‌పై ఫార్ములా-ఈ రేస్ కేసు రచ్చ రేపుతోంది. ఫార్ములా-ఈ రేస్ కేసులో పైసావంతు కూడా అవినీతి జరగేలదని కెటిఆర్ వాదిస్తున్నారు. 55 కోట్లు మాత్రం ఇచ్చేశానంటున్నాడు. ఓ మంత్రిగా, ఎవరి అనుమతి లేకుండా ఇంత పెద్దమొత్తంలో డబ్బులు ఎందుకు దాటవేశారన్నదానికి సమాధానం చెప్పడం లేదు. అవినీతి జరరగలేదు. ఏం చేసుకుంటారో చేసుకోండని, వెయ్యి కేసులు పెట్టినా భయపడేది లేదన్న వాదనతో కెటిఆర్ అబద్దాన్ని నిజం చేయాలని చూస్తున్నారు. ఇక్కడ అనుమతులు లేకుండా మంత్రిగా ఇంత డబ్బును విదేశాలకు ఎలా తరలించారన్న దానిపైనే కేసు పెట్టారు. కానీ దీనికి కెటిఆర్ ఇప్పటికీ సూటిగా సమాధానం చెప్పడం లేదు. సుప్రీంకోర్టు దాకా వెళ్లి క్వాష్ పిటిషన్లు మాత్రం వేస్తున్నారు. అబద్దాలు ఆడేవారికి అరుపులు ఎక్కువ అన్నట్లుగా ఉచ్చనీచాలు మరచి ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేస్తున్నారు. కాళేశ్వరం అవినీతి అబద్ధమా..ధరణి అక్రమాలు అబద్ధమా...సిరిసిల్ల భూముల పందేరం అబద్ధమా...ఫార్ములా కేసులో 55 కోట్లు దాటించింది అబద్ధమా.. అన్నది మాత్రం చెప్పడం లేదు. నోరుంది కదాని, రాయడానికి, వినడానికి కొందరు ఉన్నారు కదాని పదేళ్ల అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు నానాయాగీ చేస్తున్నారు. ఎసిబి విచారణను తప్పుపడుతున్నారు. ఇక్కడ గమనించాల్సిందేమంటే..అరెస్టును నిలుపుదల చేయాలన్న కేటీఆర్ అప్పీల్ కూడా తిరస్కరణకు గురైంది. ఈ క్రమంలో కేటీఆర్‌కు మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు రావాలని ఈడీ అధికారులు నోటీసుల్లో తెలిపారు. నాపై అక్రమ కేసు పెట్టారని, ఇది రాజకీయ ప్రేరేపిత లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కేసులో అసలు పసలేదని భావిస్తే...హైకోర్టు క్వాష్ పిటిషన్ ఎందుకు కొట్టేసినట్లు..కెటిఆర్ సమాధానం చెప్పాలి. ఎసిబి విచారణ చేయవచ్చని కూడా చెప్పింది. అవినీతిపరులకు అంతా అవినీతే కనిపిస్తుందని ఆరోపించి నంత మాత్రాన కెటిఆర్ అవినీతి వ్యవహారం నుంచి తప్పించుకోలేరని గుర్తించాలి. అధికారం అడ్డుపెట్టుకుని అక్రమకేసు పెట్టారని ఆరోపిస్తున్న కెటిఆర్...అదే అధికారం అడ్డం పెట్టుకుని పదేళ్ల పాటు విచ్చలవిడిగా చేసిన అక్రమాలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదు.నేనెలాంటి తప్పూ చేయలేదని, నాకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది... సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తా... జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో చర్చకు సిద్ధం...ఏసీబీ, ఈడీ విచారణకు కూడా హాజరవుతా ..అంటున్న కెటిఆర్ పదేపదే కోర్టు మెట్లు ఎక్కాలని ఎందుకు చూస్తున్నారో చెప్పాలి. ప్రపంచంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తేవాలని ఫార్ములా ఈ-కార్ రేస్‌ను నిర్వహించామని, దాని నిర్వహణకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలకు మంత్రి హోదాలో సంతకాలు చేశానని ఏసీబీ అధికారుల ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చినట్టు సమాచారం. అయితే ఆర్థిక అనుమతులు లేకుండా ఎందుకు డబ్బును దాటించారన్న దానికి సూటిగా సమాధానం చెప్పడం లేదు. డొంకతిరుగుడు మాటలు మానేసి డబ్బులు ఎందుకు దాటించారో చెప్పాలి. కానీ దీనికి సమాధానం లేదు. ఈ ఫార్ములా ఆగిపోవడంతో హైదరాబాద్ బ్రాండ్ దెబ్బతిన్నదని గగ్గోలు పెడితే చెవిలో ఎవరూ పూలు పెట్టుకోలేదని గుర్తించాలి. ముఖ్యంగా క్యాబినెట్ ఆమోదం లేకుండా డబ్బులు ఎలా బదిలీ చేశారనే అంశం గురించి ప్రశ్నిస్తుంటే..ఇంతవరకు కెటిఆర్ లేదా ఆయన అనుచర గణం సమాధానం ఇవ్వండ లేదు. ఈ ఒక్క కేసే కాదు వంద కేసులు పెట్టినా పోరాటం ఆపబోమని, ప్రతినిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటామని అహంకార పూరిత ప్రకటనలు చేసినంత మాత్రాన అవినీతి కేసులు ఆగిపోవు. నేను ఎలాంటి తప్పూ చేయలేదు.. ఎవరికీ తలవంచేది లేదు అని ప్రజలు ఎంతోకాలం మభ్య పెట్టలేమని కెటిఆర్ గుర్తిస్తే మంచిది. ఫార్ములా ఈ రేస్‌లో ముఖ్యమంత్రి డైరెక్షన్‌లోనే ఏసీబీ విచారణ చేపట్టిందని వాదించడం ద్వారా కెటిఆర్ తన పార్టీ వాళ్లకు నమ్మకం కలిగించవచ్చు..కానీ ప్రజలకు, ఎసిబికి నమ్మకం కలిగించలేరు. ఏసీబీ కేసులో పసలేదనే విషయం కేసు పెట్టినవారికి కూడా తెలుసంటూ ఇంకా బుకాయింపులు ఎందుకో కెటిఆర్ గారు చెప్పాలి. పస ఉందా లేదా అన్నది వారు విచారణలో తేలుస్తారు. అప్పటి వరకు కొంచెం ఓపిక పట్టాలి. అవినీతి కేసులు ఒక్కొక్కటి బుసకొడుతూ బయటకు వస్తుంటాయి. సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్‌తోపాటు, హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిశోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా కేటీఆర్‌ను ఎసిబి ప్రశ్నిస్తోంది. రేసు రద్దు వల్ల జరిగిన నష్టానికి ముఖ్యమంత్రి పైన కూడా కేసు నమోదు చేయాలనే వితండవాదన కూడా కెటిఆర్ తెరపైకి తెచ్చారు. రేసుల వల్ల ఇమేజ్ పెరిగితే గుర్రాలు, పత్తాల రేసులు కూడా పెట్టుకోవచ్చు. ఇక రేసులతో ఏమైనా చేయవచ్చనే మూర్ఖవాదన నుంచి కెటిఆర్ బయటపడితే మంచిది. అవినీతి ఎవరు చేసినా శిక్షార్హులే. అందుకు కెటిఆర్ కాదు..మరెవరూ అతీతం కాదని గుర్తించాలి.

# మేధో విరాణ్మూర్తి మన్మోహన్

మా సాహచర్యం విచిత్రమైనది, విశేషమైనది కూడా. ఇటీవల కీర్తిశేషుడు అయిన భారతదేశ ఆర్థిక సంస్కరణల పథనిర్దేశకుడు, ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మార్కెట్ శక్తులకు ప్రాధాన్యమిచ్చే అర్థశాస్త్ర విద్వత్తుతో ప్రభవించిన నవపథగామి. నిరుపమాన పర్యావరణవాది అనీల్ అగర్వాల్. పర్యావరణ భద్రతే ఆయన తొలి, మలి, తుది, ఏకైక లక్ష్యం. 1991లో మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టి, భారత్‌ను స్వేచ్ఛా విపణిగా రూపొందించినప్పుడు నిస్సంకోచంగా హర్షించిన వారిలో అనీల్ గానీ, నేను గానీ లేనేలేము. కొత్త ఆర్థిక పథం పర్యావరణ భద్రతకు భరోసానివ్వగలదా? అన్నదే మా ప్రశ్న. జాతి ఆర్థిక కార్యకలాపాలను క్రమబద్ధీకరించే సంస్థలు ప్రభావశీలంగా లేనప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం చేయడం మన పర్యావరణ వ్యవస్థలకు మేలు చేస్తుందా? ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్‌కు ఇవి ఇబ్బందికరమైన ప్రశ్నలే. అయితే ఆయన మా ప్రశ్నలను కొట్టివేయలేదు. ఈ విశాల దృక్పథం, నిష్పాక్షిక వైఖరే ఆయన్ను మిగతా రాజకీయ నాయకుల నుంచి విభిన్నంగా, సమున్నతంగా నిలబెట్టింది. పర్యావరణ సంబంధిత అంశాలపై మాతో ఆయన సమాలోచనలు జరిపారు. అంతమాత్రాన మా అభిప్రాయాలు, సూచనలను ఆయన అంగీకరించారని నేను చెప్పబోవడం లేదు. ఆర్థికాభివృద్ధి వ్యవహారాలను పర్యావరణ దృక్కోణం నుంచి చూడవలసిన అవసరాన్ని ఆయన అర్థం చేసుకున్నారు. మరింత విపులంగా తెలుసుకోవడానికి ప్రయత్నించారు. పర్యావరణ వ్యవస్థలను పటిష్ఠపరిచి, వాటి సమతౌల్యతను నిలబెట్టేందుకు చేయవలసిందేమిటో ఆయన సమాలోచించారు. 2004లో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి అయిన సందర్భంలో అనీల్ అగర్వాల్ ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' నిర్వహణ బాధ్యతలు నేను చేపట్టాను. అప్పటికి పర్యావరణ అధ్యయనాలు, పరిశోధనలలో నాకు పెద్దగా అనుభవం లేదు. అయితే నేను ఆ బాధ్యతల నిర్వహణకు సరిపోని వ్యక్తిననే భావాన్ని



మన్మోహన్ సింగ్ ఎప్పుడూ నాకు కలిగించలేదు. ప్రధానమంత్రి కార్యాలయానికి వెళ్లి ఆయనతో మాట్లాడే అవకాశాన్ని నాకు కల్పించారు. జలవనరుల సంరక్షణ నుంచి వాతావరణ మార్పు దాకా వివిధ పర్యావరణ అంశాలపై నేను చెప్పే విషయాలను మన్మోహన్ సావధానంగా వినేవారు. వినడమేకాదు, వివిధ సమస్యలకు పరిష్కారాలను సూచించమని కూడా నన్ను ప్రోత్సహించేవారు. 'ఏమి చేయాలి?' అన్నదానిపైనే ఆయన దృష్టి సదా ఉండేది. పులుల సంరక్షణ విషయమై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక కమిటీకి సారథ్యం వహించమని 2005లో మన్మోహన్ నన్ను కోరారు. అంగీకరించాను. ఆ కమిటీలోని ఇతర సభ్యులు వన్య ప్రాణుల, ముఖ్యంగా పులుల సంరక్షణ వ్యవహారాలలో బాగా పలుకుబడి ఉన్న అనుభవజ్ఞులు. ఆ కమిటీకి నేతృత్వం వహించడమనేది ఒక క్లిష్ట బాధ్యత. పైగా పలు విధాల అదొక కష్ట కాలం. సరిస్కా టైగర్ రిజర్వ్‌లోని పెద్దపులులు అంతరించిపోయాయి. పులుల సంరక్షణ ఎజెండాను ఎలా రూపొందించాలి? అదే సమయంలో అటవీ హక్కుల చట్టంపై పార్లమెంటు లోపలా బయటా పెద్ద చర్చ నడుస్తోంది. ఆదివాసీలకు చారిత్రకంగా జరిగిన, ఇంకా జరుగుతున్న అన్యాయాలను అరికట్టి అటవీ భూములపై వారికి హక్కులు కల్పించాలన్న డిమాండ్‌పై తీవ్ర తర్జనభర్జనలు సాగుతున్నాయి. ఆదివాసీలు నివశిస్తున్న అటవీ భూముల పరిధిలో జాతీయ ఉద్యానవనాలు, వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రాలు సైతం ఉన్నాయి. పులులతో సహా వన్య ప్రాణుల సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలా లేక ఆదివాసీల జీవన భద్రత, జీవనాధారాల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలా? ఇదొక సంఘర్షణాత్మక ఎజెండా. ఎందుకంటే రెండూ ముఖ్యమే. పులులు సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్న వారితో పాటు ఆదివాసీలకు ప్రాధాన్యమివ్వాలనే వారి వాదానలనూ మన్మోహన్ శ్రద్ధగా వినేవారు. ఆ వాద ప్రతివాదాల మధ్య ఒక సమతౌల్యం సాధించేందుకు ఆయన ప్రయత్నించారు. మా కమిటీ నివేదికలోని అంశాలపై మన్మోహన్‌తో

నేను విపులంగా చర్చించాను. ముఖ్యంగా సమ్మిళిత సంరక్షణ నమూనాను అనుసరించాల్సిన ఆవశ్యకత గురించి ఆయనకు చెప్పాను. ఆ ఎజెండా అమలులో ఎదురయ్యే సమస్యల గురించి ఆయన ప్రశ్నించారు. వన్యప్రాణుల సంరక్షణ వ్యవహారాలతో సంబంధమున్న వారందరూ సహకరిస్తారా అని ఆయన అడిగారు. అది కష్టమేగానీ అసాధ్యం కాబోదని వివరించాను. మా నివేదిక 'జాయినింగ్ ది డాట్స్' ప్రజలకు నివేదించి పులుల సంరక్షణ ఆవశ్యకతపై వారికొక స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరమున్నదని చెప్పాను. సంబంధిత విధానాలలో మార్పులకు ఇది దోహదం చేయగలదని స్పష్టం చేశాను. మా నివేదికకు, సాధారణంగా ప్రభుత్వ కమిటీల నివేదికలకు పట్టే గతే పడుతుందని భయపడ్డాను. నా భయం నిరాధారమైనదని నాకు త్వరలోనే తెలిసివచ్చింది. మా కమిటీ సిఫారసులను మన్మోహన్ ఆమోదించారు. వాటి అమలుకై సత్వర చర్యలకు ఆదేశించారు. దేశంలో పులుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా పులుల జనాభా గణన పద్ధతులు బాగా మెరుగుపడ్డాయి.

# ప్రకృతి నియమాలూ పర్యావరణ రాజకీయాలూ

తీవ్ర వాతావరణ సంఘటనల సంవత్స రంగా, అత్యంత ఉష్ణోగ్రతల కాలంగా చరిత్రలో నిలిచిపోతూ 2024 మన నుంచి సెలవు తీసుకుంది. ఎప్పుడూ ఎరగని వడగాడ్పులు, భయంకరమైన చలిగాలులు మనల్నే కాదు శ్రీలంక, మాల్దీవుల్ని కూడా ఈ ఏడాది అతలాకుతలం చేశాయి. మొన్నటికి మొన్న 'ఫంగల్' తీరం దాటుతున్నప్పుడు పాండిచ్చేరిలో ఒకేసారి 50 సెంటీమీటర్ల వర్షం కురిసింది! 2023లో ఆకాశానికి రంధ్రం పడినట్లు ఒకే రోజు 95 సెంటీమీటర్ల వాన కాయపట్నాన్ని (తూత్తుడి) ముంచెత్తింది! ప్రతి ఏటా ఈశాన్య రుతుపవనాల కాలంలో దక్షిణ ద్వీపకల్పంలో సగటున ఇలాంటి నాలుగు తుఫాన్లు తప్పవని ఇటీవల భారత వాతావరణ శాఖ మొహమాటం లేకుండా ప్రకటించింది. ఇక మొత్తం భూమండలాన్ని పరిశీలిస్తే 1.5 డిగ్రీలకు మించి భూమి ఉష్ణోగ్రత పెరగరాదని మనం పెట్టుకున్న లక్ష్మణ రేఖ ఉత్తుత్తి గీతగా మిగిలిపోయిందనీ, 2035 నాటికి 3.1 సెల్సియస్ డిగ్రీలు పెరిగినా ఆశ్చర్య పోనక్కరలేదని హెచ్చరిస్తున్నారు. ఇదే జరిగితే ఆంత్రోపోసిన్ యుగం మనల్ని అంతుబట్టని తీరాలకు చేర్చడం ఖాయం.

మాంట్రియల్ ప్రోటోకాల్ (1989) ముందుకు తెచ్చిన ఓజోన్ పొర రక్షణ, క్యోటో ప్రోటోకాల్ (2005) ప్రతిపాదించిన గ్రీన్‌హౌస్ ఉద్గారాల తగ్గింపు, పారిస్ ఒప్పందపు (2016) ఉష్ణోగ్రతల తగ్గింపు, గ్లాస్గో క్లైమేట్ ప్యాక్ట్ లోని శూన్య ఉద్గార దేశాలకు నష్టపరిహార చెల్లింపు వంటివి పర్యావరణ ప్రియులందరూ గొప్ప మైలురాళ్ళుగా చెప్పుకుంటారు. వాటి విలువను తక్కువ అంచనా వెయ్యలేము. మొన్నటికి మొన్న 'బాకు' నగర అంతర్జాతీయ సదస్సులో ఆమోదించిన 'ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ కార్బన్ మార్కెట్' స్థాపన, కార్బన్ ఉద్గారాల నికర డేటా డాక్యుమెంటేషన్ వ్యవస్థ ఏర్పాటు కూడా గొప్ప ముందడుగుగా భావించవచ్చు. కానీ పేద దేశాలకు అందించే నష్టపరిహారంపై ధనిక దేశాలు గొప్ప ఉదారతను ప్రదర్శించినట్టు అంతర్జాతీయ మీడియా కొనియాడ్డమే ఆశ్చర్యం కలిగిస్తుంది. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షైన్ బమ్ (ఆమె పర్యావరణ శాస్త్రవేత్త కూడా) లాగా 2050 నాటికి తాము శూన్య ఉద్గార దేశంగా మారి తీరుతామని బల్ల గుద్ది మరీ చెప్పిన అధినేత ఒక్కరంటే ఒక్కరూ లేరు. అలాగే 2040 కల్లా బొగ్గు గనులన్నీ మూసేస్తామని చెప్పిన



ఇండోనేషియా లాంటి దేశం ధనిక దేశాల్లో ఒక్కటంటే ఒక్కటీ లేదు. ఉద్గారాల వరుసలో ముందున్న 24 దేశాలన్నీ పేద దేశాలకు ఆర్థిక సాయం గురించి మాట్లాడాయే తప్ప 'నెట్ జీరో' సాధిస్తామని మాట వరసకైనా చెప్పలేదు. "మేం పర్యావరణ ధ్వంసం చేస్తాం. పేద దేశాలు విలవిలలాడుతాయి. వాటికి అంతో ఇంతో సాయం చేస్తాం" ఇదీ వాటి తీరు! ఇక నష్టపరిహారం కిందా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసమూ ఇస్తామంటున్న నిధులు కూడా బ్యాంకులో, కార్బన్ మార్కెట్లో, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో సమకూరుస్తాయి తప్ప ప్రభుత్వాలు మాత్రం పూర్తి బాధ్యత తీసుకోవట! విచిత్రం ఏమంటే సంపన్న దేశాల్లో ఎంత శాస్త్ర సాంకేతికత పెరిగినా కర్బన ఉద్గారాలేమీ తగ్గడం లేదు. ఉద్గారాల 'లెక్కల్లో లాఘవం' మాత్రం పెరుగుతోంది. ఏకీకృత అంతర్జాతీయ వ్యవస్థ ఏదీ మన భూగోళం గురించి పట్టించుకునేది లేకపోవడం పెద్ద విషాదం. ఇక కాప్ 29 సదస్సులో ఆయిల్ గ్యాస్ కంపెనీల అధినేతలు "మేం లేకుంటే మానవుడు మళ్ళీ గుహల్లో బతకాల్సిందే" అంటూ ప్రారంభ సభలోనే బెదిరింపులకు దిగడం విచిత్రాల్లోకల్లా విచిత్రం. కాలం అలా వుంది మరి! ఎప్పుడూ ఎరగని అసమానతల వైపరీత్యం ఒకవైపు, బహుళ జాతి కంపెనీల విశ్వరూపం మరోవైపు, పర్యావరణ సమస్యనే అంగీకరించని నాయకులు పీఠాలెక్కడం ఇంకోవైపు ముప్పేట ముసురుకొస్తున్న కాలం మనది. ఇలా ప్రకృతి నియమాలూ పర్యావరణ రాజకీయాలూ శత్రు శిబిరాలుగా మారిన కాలం మనది. సమస్య మన అభివృద్ధి నమూనాలో, ఆర్థిక విధానాల్లో, మితవాద రాజకీయ పోకళ్ళలో వుందని చెప్పే వారే కరువైన కాలం కూడా మనది. దీనికి సమాధానంగా ప్యారిస్ పరిసరాల్లో పదేళ్ళ క్రితం ఏడు రోజుల పాటు స్వేచ్ఛగా చర్చోప చర్చలు జరిపిన దేశ విదేశీ విద్యార్థులు "అందరూ అడిగే రోజు ఒకటి వస్తుంది. అప్పుడు సముద్రాలూ అమెరికాను నిలదీస్తాయి. వాతా వరణమూ చైనాను నిగ్గదీస్తుంది" అంటారు. చూడ్డానికిది భావకవిత్వంగా కనిపించ వచ్చునేమో గాని ఇలాంటి భావితరం కన్నా పుడమి తల్లి రక్షణకు ప్రస్తుతానికి భరోసా ఎక్కడుంది?

## పతి మనిషికి ఆధ్యాత్మిక చింతన అవసరమని: కొప్పు భాష



యాచారం జనవరి 10 ప్రజా స్వేచ్ఛ

యాచారం మండల కేంద్రంలో తిరుమలేశుని గుట్ట పై వైకుంఠ ఏకాదశి సందర్భంగా బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొప్పు భాష ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈసందర్భంగా ఆయన ప్రతి మనిషి దైనందిత జీవితంలో ఆధ్యాత్మిక చింతనను అలవరుచుకోవాలని, ప్రస్తుత పరిస్థితుల్లో జీవితంలో సన్మార్గంలో నడవడంతో పాటు సవాళ్ళని ఎదుర్కొని, ఒత్తిడిని అధిగమించడానికి, మానసికంగా, ప్రశాంతంగా ఉండటానికి మనకు ఆధ్యాత్మిక చింతన ఎంతగానో అవసరమని తెలిపారు. ఆ విష్ణుమూర్తి దయతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు .

## వాటర్ ట్యాంక్ లీకేజీ పునరుద్ధరణ



యాచారం జనవరి 10 ప్రజా స్వేచ్ఛ

యాచారం మండలం పరిధిలోని మాల్ గ్రామపంచాయతీ లో ఒకటవ వార్డులో వాటర్ ట్యాంక్ లీకేజీ తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు . ఈ సమాచారాన్ని యాచారం మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ దృష్టికి మాల గ్రామ ప్రజలు బెల్లి దేవేందర్, బెల్లి ఇంద్రమ్మ శ్రీనివాస్ తో తెలుపగా ఐదువేల రూపాయలతో లీకేజ్ మరమ్మతులు చేయించారు వాటి ప్రజలు ఈ సందర్భంగా శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో నిమ్మరాజు అంజయ్య, ఐతగొని సత్యనారాయణ , చౌదరిపల్లి శేఖర్, చౌదర్పల్లి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆంగోత్ వెంకటేష్ సహకారంతో క్రీడా సామాగ్రి అందజేత




యాచారం జనవరి 10 ప్రజా స్వేచ్ఛ

ఆల్మైటీ ఫౌండేషన్ అధ్యక్షులు ఆంగోత్ వెంకటేష్ సహకారంతో అండర్ -19 యువకులకు క్రికెట్ బ్యాట్, బాల్, వికెట్ కిట్ లను తక్కళ్లపల్లి తండా మాజీ ఉప సర్పంచ్ జరుప్ల విజయ్ కుమార్ నాయక్ ముఖ్యఅతిధిగా హాజరై క్రీడాకారులకు బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో రమావత్ సుధాకర్, రమావత్ నరేందర్, సభావత్ రాజేష్, రమావత్ రిమాజీ, సబావత్ సురేష్, రమావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారుల



శ్రీయుత గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి నమస్కరించి మరియు దేవాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీ కొండా సురేఖ గారికి నమస్కరించివ్రాయునది

విషయము.

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి కొత్తకొండ కొమురవెల్లి అయినవోలు దేవాలయాలలో కుమ్మరులకు చైర్మన్లుగా డైరెక్టర్లుగా అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న కుమ్మరులకు అవకాశాలు కల్పించాలని కోరుచున్నాము??

మీ

కుమ్మరి హక్కుల పోరాట పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# జై కుమ్మరి జై ప్రజాపతి



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ ఎల్బీనగర్

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న కుమ్మర బంధువులారా భవిష్యత్తులో కులం బాధ్యత మోయాల్సిన యువకుల్లారా ఇది మనస్సుపెట్టి చదవండి. ఇంతకుముందు మన కుల సంఘాలు కోరినట్టుగా కుమ్మర/కులాల/శాలివాహన తోపాటు ప్రభుత్వ గెజిట్ లో ప్రజాపతిని కూడ జత చేయడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతున్నది. కొంతమంది మనకులం పేరు కుమ్మర తీసేసి ప్రజాపతని నమోదు చేస్తున్నారు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు అది తప్పుడు ప్రచారం. తెలంగాణ బిసి కమిషన్ ఈ మధ్యనే కుమ్మర/కులాల/శాలివాహన తోపాటుగా అంటే వీటిని అలాగే ఉంచి ప్రజాపతి అనే పేరును పర్యాయ పదంగా జత చేయాలని మన అభ్యర్థనలు మేరకు నిర్ణయించింది. దీనిగురించి ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే అట్టి అభ్యంతరాలను ఖైరతాబాద్ లోని బిసి కమిషన్ ఆఫీసులో అభ్యర్థనలు అందించాలని బి సి కమీషన్ సూచించింది. కులం పేరు మన పేరు చివర జత చేయడం ద్వారా మన కులంవారు ఎవరో తెలుసుకోగలుగుతాము. అవసరమైనచోట ఒకరికొకరు సహకరించుకోగలిగే అవకాశాలున్నాయి తద్వారా కులం వేగవంతంగా అభివృద్ధి చెందుతుంది. ప్రజాపతి గెజిట్ లో చేర్చడం వల్ల ఎలాంటి ప్రయోజనాలుగాని మన రిజర్వేషన్ లు గాని తగ్గవు కేవలం పుకార్లు మాత్రమే. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజాపతి అనే పదం ప్రజల్లోకి వెళ్లింది చాలా మంది ఇప్పటికే ప్రజాపతి పేరును తమ పేరు చివర జత చేసుకొని సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నారు అంతేకాకుండా ప్రజాపతి అనే పదానికి చారిత్రక నేపథ్యం కూడా ఉంది ముఖ్యంగ యువత ఆ పేరు పెట్టుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటినుండి ప్రజాపతి అనే పేరుకూడా అధికారికంగా ప్రభుత్వ గెజిట్ లో చేరాలంటే ఇప్పటివరకు ప్రజాపతిని తమ పేరుకు జత చేసుకున్నవాళ్ళు అదేవిధంగా భవిష్యత్తు తరాల వాళ్ళకి కుమ్మర/కులాల/ శాలివాహన తో పాటు ప్రజాపతి అనే పేరును గెజిట్ లో చేర్చాలని కోరుకునెవాల్లు సంఘాలుగా కాని, వ్యక్తులుగా కాని, ప్రజా ప్రతినిధులుగా కాని లిఖితపూర్వకంగా ఎవరైనా బిసి కమిషన్ కు ఈ నెల 18 లోపల ఖైరతాబాద్ లోని బిసి కమిషన్ ఆఫీసులో ప్రజాపతికి మద్దతుగా తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరుతున్నాను ఇదే చివరి అవకాశం.


మీ

కుమ్మరి హక్కుల పోరాట పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## ఉత్తరాది రాష్ట్రాలను వణికిస్తున్న చలి..!!

న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ

ఉత్తరాది రాష్ట్రాలను చలి వణికిస్తోంది. మరోసారి ఢిల్లీలో గాలి నాణ్యతలు (ఎక్యూఐ) పడిపోయాయి. గురువారం ఉదయం 7 గంటలకు ఢిల్లీలో 299 వద్ద ఎక్యూఐ నమోదైందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ఆదివారం నుంచి వరుసగా ఢిల్లీలో వాయునాణ్యతలు పడిపోతున్నాయి. దీంతో ఢిల్లీని పొగమంచు కమ్మేసింది. రహదారులు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ఈరోజు ఉదయం 5.30 గంటలకు కనిష్ట 6.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఉత్తరాది రాష్ట్రాలను చలి వణికిస్తున్న సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఈరోజు దట్టమైన మంచు కురిసింది. 7.30 గంటలకు లక్నోలో 7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ప్రయాగ్‌రాజ్‌లో 7.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఐఎండి



తెలిపింది. హర్యానా, అంబాలాలో జనవరి 14 వరకు కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. జమ్మూకాశ్మీర్‌లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. గురువారం 8.30 గంటలకు -3.2, గుల్మార్గ్ -4.6, పహల్గామ్‌లో -10.3, బనిహల్ 4.8, కుప్వారాలో -3.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మట్ట వెంకటయ్య గౌడ్

వెల్దండ, జనవరి 10 ప్రజా స్వేచ్ఛ

వెల్దండ మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, వెల్దండ సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ కార్యకర్తలను కలుస్తూ, తమదైన రీతిలో సహాయ సహకారాలు అందిస్తూ, నిత్యము ప్రజల మధ్య ఉంటూ కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకగా నిలుస్తున్నారు. మట్ట వెంకటయ్య గౌడ్ గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీకి శక్తివంచన లేకుండా కార్యకర్తలకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఇతర పార్టీల నేతలతో పోలిస్తే, మట్ట వెంకటయ్య గౌడ్ ముందంజలో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల రేసులో ఆయన ముందంజలో ఉన్నట్టు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మట్ట వెంకటయ్య గౌడ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో కలిసి పని చేస్తూ కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఎలాగైనా



స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపొంది, స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి బహుమతిగా ఇవ్వాలని ప్రజలతో అన్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మట్ట వెంకటయ్య గౌడ్ పిలిస్తే పలికే నాయకుడని వెల్దండ ప్రజలకు అర్థం అయిపోయింది. ఎలాంటి ఆటుపోటులనైనా ఎదిరించి పోరాడాలని కార్యకర్తలకు దేశానిర్దేశం చేసినట్టు సమాచారం.

# శ్రీలక్ష్మీ కాన్సెప్ట్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు





గద్వాలజిల్లా బ్యూరో, జనవరి 10ప్రజా స్వేచ్ఛ

ధరూర్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ కాంసెప్ట్ స్కూల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పండగల విశిష్టత సాంప్రదాయాలు సంస్కృతిల విషయాలు అర్థమయ్యేలా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల సమక్షంలో భోగిమంటలు, హరి దాసులు, రంగవల్లులు, కోలాటాలు, సోది చెప్పడం, విద్యార్థులు గాలిపటాలు ఎగరవేయడంలాంటి కార్యక్రమాలతో పండగ వాతావరణం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, హెచ్ఎం, ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహణ

- గెలుపొందిన వారికి జనవరి 26 న సింగరేణి అధికారులచే బహుమతుల ప్రధానోత్సవం

- పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపల్ పురుషోత్తం



మందమర్రి, జనవరి 10 ప్రజా స్వేచ్ఛ


మందమరి పట్టణంలోని సింగరేణి (ఎయిడెడ్) ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులకు ముందస్తుగా సంక్రాంతి ముగ్గుల పోటీలు మందమర్రి ఏరియా సింగరేణి ఉన్నత పాఠశాల (ఎయిడెడ్) ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలు ప్రధానోపాధ్యాయుడు జే.పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించారు. ఈ పోటీల్లో 128 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ముగ్గుల పోటీలలో పాల్గొని ప్రతిభ కనపరచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జనవరి 26 రిపబ్లిక్ డే వేడుకలలో సింగరేణి అధికారుల చేతుల మీదుగా బహుమతులు ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయశ్రీ, దేవి, అనిత, మాధవి, అనుపమ, కల్పలత, తిరుపతి రెడ్డి, సుధాకర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, దయాకర్, ఏ.శ్రీనివాస్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.౦

## అనంత పద్మనాభ స్వామి ఆలయంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

-ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనితారెడ్డి

-ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి

-అలరించిన వీణవాదనం, గాత్రం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, జనవరి 10 ప్రజా స్వేచ్ఛ

పెంజర్ల అనంత పద్మనాభ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శనం చేసుకుని తరించారు. ఆలయ కమిటీ చైర్మెన్ బెజవాడ అనిత రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హిందూ సేవా సమితి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో దుర్గా మైత్రేయ శిష్య బృందం ప్రదర్శించిన వీణా వాదనం గాత్రం భక్తులను అలరించింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రవీందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు నందిగామ సుధాకర్, దామోదర్ రెడ్డి, ఆర్ఐ రాంబాబు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# క్రీడలతో మానసిక ఉత్సాహం





-జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత...

గద్వాల జిల్లా బ్యూరో, జనవరి 10(ప్రజా స్వేచ్ఛ)

గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 23 వ వార్డ్ కౌన్సిలర్ కబీర్ దాస్ అనిత నర్సింహులు యూత్ అధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం తెలుగుపేట ప్రీమియర్ లీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ ను జెడ్పి మాజీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత విద్యతో పాటు క్రీడా నైపుణ్యం పొంది క్రీడా రంగంలో కూడా రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడలు ప్రతి ఒక్క క్రీడాకారులు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మీ ప్రదర్శనలు తీయాలని, భవిష్యత్తులో ఇలా రంగంలో అత్యున్నత స్థాయికి ఎదిగి గద్వాల ప్రాంతానికి కూడా మంచి పేరు వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమే, ఓడిపోయినా నిరుత్సాహం పడకూడదన్నారు. గెలిచామని గర్వపడొద్దని, స్నేహపూర్వకంగా క్రీడలను ఆడాలన్నారు. ఓడిపోయినా ఓటమి విజయానికి నాందిగా భావించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ బాబు, అమరవాయి కృష్ణారెడ్డి, గోనుపాడు శ్రీనివాస్ గౌడ్, పెద్దొడ్డి రామకృష్ణ, పులిపాటి వెంకటేష్, భాస్కర్ యాదవ్, టిఎన్ఆర్ జగదీష్, చేపల చిన్న, వెంకట్రాములు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్.తిరుమలేష్, ఇలియాస్, కెవమ్మార్ ఏసు, మాజీ సర్పంచ్ దాసన్న, అయ్యప్ప, హైదర్, అజార్, మధు, విజయ్, వెంకటేష్, వినోద్, రాము, రాజేష్, నర్సింహులు, జగదీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పండగ విశిష్టత తెలిసేలా శ్రీ చైతన్యలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

- ముగ్గుల పోటీలు, కైట్ ఫెస్టివల్ పోటీలు నిర్వహణ...

-తెలుగు ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకునే తెలుగు పండుగ సంక్రాంతి

-భోగి మంటలు అంటించి వేడుకలు ప్రారంభించిన ప్రిన్సిపాల్ ఎం.రమేష్

- విజేతలకు బహుమతులు అందజేత...



మందమర్రి, జనవరి 10 (ప్రజా స్వేచ్ఛ)

మందమర్రి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి పండుగ సంబరాలు ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.రమేష్ భోగి మంటలు ప్రారంభించి విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు పాఠశాల తల్లిదండ్రులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ తోటి ఉపాధ్యాయులు రేగుపండ్లు, పూలను చిన్న పిల్లల తలపైపోసి విద్యార్థినిలు, మహిళలు రంగులతో ముగ్గులు వేశారు. అనంతరం విద్యార్థులు గాలి పటాలు ఎగరవేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ.. భోగి, కనుమ, మకర సంక్రాంతి మూడు రోజులు ఘనంగా అందరూ పండుగను జరుపుకుంటారు. సంక్రాంతి పండుగ తెలుగు ప్రజలు మూడు రోజులు జరుపుకునే పండుగ ఒక్కొక్క రోజు ఒక్కొక్క పండుగ చాలా విశిష్టత కలిగి ఉంటుందన్నారు. పశువులను, లక్ష్మీ స్వరూపాలుగా భావించి, అందంగా అలంకరించి పూజిస్తారు. బసవరాజుల నాటకం గంగిరెద్దుల ముస్తాబు చేసి సంక్రాంతికి ఊరేగిస్తారనీ, ఇలా చేయడంతో సంపద వృద్ధి చెందుతుందని నమ్ముతారన్నారు. ఎద్దు, కోడిపందాలు ఆడుతూ ధాన్యం, వస్త్రాలు ధానం చేస్తారన్నారు. పిండి వంటలతో ఘనంగా పండుగను జరుపుకుంటారని ప్రిన్సిపాల్ ఎం.రమేష్ విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పండగ విశిష్టతను తెలియజేశారన్నారు. అనంతరం ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. వీరిని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్లు శ్రీవిద్య, ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ రవి, సి బ్యాచ్ ఇంచార్జి సంపత్, ప్రైమరీ ఇంచార్జి సునీత, ప్రీ ప్రైమరీ ఇంచార్జి తిరుమలతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# జానంపేట వెంకటేశ్వర స్వామి దేవాలయానికి పోటెత్తిన భక్తులు





-హాజరైన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, ప్రముఖులు, ఉన్నతాధికారులు

-రికార్డు స్థాయిలో సుమారు 40 వేల మందికి పైగా భక్తుల దర్శనం

-భక్తుల సేవలో ప్రజా ప్రతినిధులు, నాయకులు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, జనవరి 10ప్రజా స్వేచ్ఛ

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని అతి పురాతన చరిత్ర గల జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువ జామునే ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. ప్రత్యేక పూజలు, అర్చన, హారతుల అనంతరం స్వామివారు భక్తులను కటాక్షించారు. ఆలయ నిర్వహకులు మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తదితర భక్త బృందం ఏకాదశి సందర్భంగా కనీవిని ఎరుగని రీతిలో ఆలయాన్ని అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. ఎన్నడూ లేనివిధంగా ఏడాది ముక్కోటి ఏకాదశి వేడుకలకు సుమారు 40 వేల మందికిపైగా జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించడం విశేషం. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు వై. అంజయ్య యాదవ్, చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, మాజీ జెడ్పీటిసి వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపిటిసి భార్గవ కుమార్ రెడ్డి, కార్మిక నేత పినపాక ప్రభాకర్, సీనియర్ జర్నలిస్ట్ ఖాజా ఫాష, ఏసిపి రంగస్వామి షాద్ నగర్ సిఐ విజయ్ కుమార్, నందిగామ సిఐ ప్రసాద్ పలువురు ఎస్సైలు, ఏఎస్సైలు సిబ్బంది, దేవాదాయ శాఖ ఉద్యోగులు, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖల ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, న్యాయవాదులు ప్రజలు భక్తులు దర్శనానికి పోటెత్తడంతో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ వెంకటేశ్వర స్వామి మహావిష్ణువు రూపంలో దర్శించుకున్న వేళ వైకుంఠం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. భక్తులు వైష్ణవాలయానికి తరలివచ్చారు. వైకుంఠ ఏకాదశి వేళ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. పవిత్ర ధనుర్మాసంలో సూర్యుడు ఉత్తరాయణానికి మారే వైకుంఠ ఏకాదశి రోజున భగవంతుడిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. గోవింద నామస్మరణతో ఆలయం మారుమోగిపోతుంది. ఆలయంలో ప్రత్యేక క్యూ లైన్ల ద్వారా స్వామివారి దర్శనానికి అనుమతి ఇవ్వడంతో భక్తులు పెద్ద ఎత్తున తండోపతండాలుగా స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయాన్ని పూలతో అందంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు మీడియా ప్రతినిధులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా సేవ చేశారు. వారిలో మోహన్ రెడ్డి, భూపాల్, వగ్గు కిషోర్, రఘు, అనంతయ్య, అందె బాబయ్య, కుమార్ గౌడ్, బచ్చలి నరసింహ, రఘునాథ్ యా తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు మీడియాతో మాట్లాడుతూ.. ఆలయాల్లో ఉత్తర ద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శిస్తే సమస్త పుణ్యఫలంపరలు చేకూరతాయని భక్తుల విశ్వాసమని వైకుంఠ ద్వార దర్శన నేపథ్యంలో భక్తులకు సకల సౌకర్యాలు సమకూర్చడంతో పాటు ఆలయంలో ఆకుల వెంకటేశం గుప్త అరుణ దంపతులు తమ కుమారుడు దివంగత రాఘవేందర్ గుప్తా పేరిట అల్పాహారం భక్తులకు పంపిణీ చేశారు.

## బిజినెస్

# టీసీఎస్‌లో ఐదువేల ఉద్యోగుల తగ్గుదల

-క్యూ3లో రూ.12,380 కోట్ల లాభాలు




న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో భారీగా ఉద్యోగులు తగ్గారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 5,000 మంది ఉద్యోగులు తగ్గారు. ఇదే విషయాన్ని ఆ సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో తెలిపింది. దీంతో డిసెంబర్ ముగింపు నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,07,354గా నమోదయ్యింది. క్రితం క్యూ3లో కంపెనీ నికర లాభాలు 12 శాతం పెరిగి రూ.12,380 కోట్లుగా చోటు చేసుకున్నాయి. ఇంతక్రితం ఏడాది 2023-24 ఇదే త్రైమాసికంలో రూ.11.058 కోట్ల లాభాలు ప్రకటించింది. గడిచిన క్యూ3లో కంపెనీ మొత్తం ఆదాయం 5.6 శాతం పెరిగి రూ.63,973 కోట్లకు చేరింది. డిసెంబర్ త్రైమాసికం ఫలితాల సందర్భంగా ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్‌తో పాటు, రూ.66 చొప్పున స్పెషల్ డివిడెండ్ చెల్లిం చనున్నట్టు టీసీఎస్ తెలిపింది. దీనికి జనవరి 17న రికార్డు తేదీగా తీసు కోనున్నట్టు పేర్కొంది. ఫిబ్రవరి 3న చెల్లింపులు జరుగుతాయని పేర్కొంది.

# శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో దిగజారిన భారత్ ర్యాంక్..!




ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో భారత్ 85వ స్థానంలో నిలిచింది. గత ఏడాది 80వ స్థానంలో ఉండగా.. ఈ సారి ఐదు స్థానాలు దిగజారింది. వీసా రహితంగా ట్రావెల్ చేయగలిగిన గమ్యస్థానాల ఆధారంగా హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2025 ఈ ర్యాంకింగ్స్‌ను ఇచ్చింది. మొత్తం 199 దేశాల్లో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాను ప్రకటించింది. ఈ జాబితా ప్రకారం భారత పాస్‌పోర్టుతో 57 దేశాలకు వీసా లేకుండానే ప్రయాణించే వీలుంది. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ఇచ్చిన డేటా ఆధారంగా ఈ ర్యాంక్‌లను ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాలో సింగపూర్ తొలి స్థానంలో నిలిచింది. ఈ దేశ పాస్‌పోర్టు కలిగిన వారు వీసా లేకుండానే 195 దేశాలకు వెళ్లొచ్చు. సింగపూర్ తర్వాత జపాన్ రెండో స్థానంలో నిలిచింది. ఈ దేశ పాస్‌పోర్టుతో వీసా లేకుండానే 193 దేశాలను చుట్టేయొచ్చు. ఇక ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, దక్షిణ కొరియా, స్పెయిన్ దేశాలు మూడో స్థానంలో నిలిచాయి. ఈ దేశాల పాస్‌పోర్టుతో వీసా లేకుండా 192 దేశాలను సందర్శించొచ్చు. ఆ తర్వాత ఆస్ట్రియా (191), డెన్మార్క్ (191) దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# గ్లోబల్ బ్యాంక్‌ల్లో లక్షలాది ఉద్యోగులకు ముప్పు




కృత్రిమ మేధా (ఎఐ) ప్రభావంతో వచ్చే ఐదేళ్లలో బ్యాంకింగ్ రంగంలో లక్షలాది ఉద్యోగాలు ఊడనున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ప్రస్తుతం మానవ ఉద్యోగులు నిర్వహిస్తున్న పనులను ఎఐ ఆక్రమించడంతో అంతర్జాతీయ బ్యాంకులు రాబోయే మూడు నుండి ఐదు సంవత్సరాలలో దాదాపు 2 లక్షల ఉద్యోగాలను తొలగించనున్నాయని అంచనా. ఆయా బ్యాంకుల చీఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ అధికారులను బ్లూమ్‌బర్గ్ సర్వే చేసి ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఒక్కో బ్యాంకు సగటున తమ వర్క్‌ఫోర్స్‌లో నికరంగా 3 శాతం మందిని తగ్గిస్తుందని అంచనా. ఇక కెవైసి విధులను నిర్వర్తించే పాత్రలకు ముప్పు తప్పదని పేర్కొంది. మానవ వనరుల సంఖ్యలో 5 శాతం నుంచి 10 శాతం వరకు తగ్గొచ్చని మొత్తం 93 మంది ప్రతినిధులు పాల్గొన్న ఈ సర్వేలో దాదాపు నాలుగింట ఒక వంతు మంది అభిప్రాయపడ్డారు.

# వన్డే క్రికెట్‌లో భారత మహిళల జట్టు జోరు

టీమిండియా 6 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై విజయం


మూడు వన్డేల సిరీస్ 1-0తో ఆధిక్యం




వన్డే క్రికెట్‌లో భారత మహిళల జట్టు జోరు కొనసాగుతోంది. సొంతగడ్డపై ఐర్లాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో స్మృతి మంధాన సారథ్యంలోని భారత జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం రాజ్‌కోట్ వేదికగా జరిగిన తొలి వన్డేలో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. ఈ గెలపుతో మూడు వన్డేల సిరీస్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. టీమిండియా ఓపెనర్ ప్రతీకా రావల్(96 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 83), తేజల్ హసబ్నిస్(46 బంతుల్లో 9 ఫోర్లతో 53 నాటౌట్) హాఫ్ సెంచరీలతో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 238 పరుగులు చేసింది. ఆ జట్టు కెప్టెన్ గబీ లూయిస్(129 బంతుల్లో 15 ఫోర్లతో 92) తృటిలో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. లీహ్ పాల్(73 బంతుల్లో 7 ఫోర్లతో 59) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో ప్రియా మిశ్రా(2/56) రెండు వికెట్లు తీయగా.. టిటస్ సధు, సయలి, దీప్తి శర్మ తలో వికెట్ తీసారు. అనంతరం భారత మహిళల జట్టు 34.3 ఓవర్లలోనే 4 వికెట్లకు 241 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ స్మృతి మంధాన(29 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 41) శుభారంభం అందించింది. ఐర్లాండ్ బౌలర్లలో అర్లెనే కెల్లీ ఓ వికెట్ తీయగా.. మాగ్యూరీ మూడు వికెట్లు పడగొట్టింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే ఆదివారం జరగనుంది. టీ20 ప్రపంచకప్ 2024 అనంతరం సొంతగడ్డపై న్యూజిలాండ్, వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లను గెలుచుకుని జోరు మీదున్న భారత మహిళల జట్టు.. హ్యాట్రిక్ సిరీస్ విజయంపై కన్నేసింది. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి భారత్‌లో జరగాల్సి ఉన్న మహిళల వన్డే వరల్డ్‌కప్ ముందు ఈ సిరీస్‌లను టీమిండియా సన్నాహకంగా వాడుకోనుంది. ఈ సిరీస్ నుంచి రెగ్యులర్ సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు సెలక్టర్లు విశ్రాంతినిచ్చారు. దాంతో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన జట్టును నడిపిస్తోంది.

# ప్యాట్‌కమిన్స్ అత్యుత్తమ కెప్టెన్

టీమిండియా మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్



ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్‌కమిన్స్‌పై టీమిండియా మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ ప్రశంసల జల్లు కురిపించాడు. ఈ తరం అత్యుత్తమ కెప్టెన్ అని కొనియాడాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ కంటే కూడా కమిన్స్ మెరుగైన సారథని పరోక్షంగా అభిప్రాయపడ్డాడు. ఆస్ట్రేలియాతో ఇటీవల ముగిసిన ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా దారుణంగా విఫలమైన విషయం తెలిసిందే. 10 ఏళ్ల తర్వాత టీమిండియా 1-3తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ఆసీస్‌కు కోల్పోయింది. అంతకుముందు సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన మూడు టెస్ట్‌ల సిరీస్‌లోనూ టీమిండియా క్లీన్ స్వీప్ అయ్యింది. ఈ పరాజయాలతో డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు నుంచి తప్పుకుంది. దాంతో కెప్టెన్ రోహిత్ శర్మపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు 2021లో ఆసీస్ సారథ్య బాధ్యతలు చేపట్టిన కమిన్స్.. డబ్ల్యూటీసీ 2023, వన్డే ప్రపంచకప్ 2023, యాషెస్ సిరీస్, బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ టైటిళ్లను అందించాడు. ఈ క్రమంలోనే అతని సారథ్యంపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. దినేశ్ కార్తీక్‌కు కూడా కమిన్స్ సారథ్యాన్ని కొనియాడాడు. 'నా అభిప్రాయం ప్రకారం ప్రస్తుత సమయంలో ప్యాట్ కమిన్స్ అత్యుత్తమ కెప్టెన్. మంచి దూకుడైన ఆటగాడు. అయితే తన దూకుడును మాటల్లో.. తిట్లలో కాకుండా ఆటలో చూపిస్తున్నాడు. తనదైన శైలిలో పోస్ట్ మ్యాచ్, ప్రీ మ్యాచ్ ప్రజెంటేషన్స్‌లో మీడియాను హ్యాండిల్ చేస్తున్నాడు. జట్టును అద్భుతంగా నడిపించే సత్తా అతనికి ఉంది. ప్రస్తుతం ప్రపంచంలోనే కమిన్స్ నెంబర్ వన్ కెప్టెన్.'అని దినేశ్ కార్తీక్ చెప్పుకొచ్చాడు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ప్యాట్ కమిన్స్ ఆల్‌రౌండ్ షో కనబర్చాడు. బౌలర్‌గా 25 వికెట్లు తీయడంతో పాటు బ్యాటింగ్‌లోనూ విలువైన పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతేకాకుండా డబ్ల్యూటీసీ చరిత్రలోనే 200 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్‌గా చరిత్రకెక్కాడు. శ్రీలంకతో జరిగే ఆస్ట్రేలియా అప్‌కమింగ్ రెండు టెస్ట్‌ల సిరీస్‌కు కమిన్స్ దూరమయ్యాడు. ఇటీవలే తండ్రైన కమిన్స్ పెటర్నిటీ లీవ్ తీసుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా అతను దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. చీలమండ గాయంతో కమిన్స్ బాధపడుతున్నట్లు వార్తలు వచ్చాయి.

## స్పోర్ట్స్

# 9 ఓవర్లలో 52 పరుగులిచ్చి 5 వికెట్లు..

రాజస్థాన్ బ్యాట్స్‌మెన్ వెన్ను విరిచిన వరుణ్ చక్రవర్తి




విజయ్ హజారే ట్రోఫీలో భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 5 వికెట్లు తీసి సంచలనం సృష్టించాడు. వడోదరలోని కోటంబి స్టేడియంలో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి రాజస్థాన్ బ్యాట్స్‌మెన్ వెన్ను విరిచాడు. తమిళనాడు తరపున వరుణ్ చక్రవర్తి 9 ఓవర్లలో 52 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. వరుణ్ చక్రవర్తి అద్భుత ప్రదర్శనతో తమిళనాడు జట్టు రాజస్థాన్‌ను 267 పరుగులకు ఆలౌట్ చేసింది. తమిళనాడు కెప్టెన్ ఆర్ సాయి కిషోర్ టాస్ గెలిచి మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయించుకోవడం సరైనదని నిరూపించాడు. అద్భుతమైన ప్రదర్శన కారణంగా, వరుణ్ చక్రవర్తి ఇంగ్లండ్‌తో జరిగే టీ20, వన్డే సిరీస్‌లకు ఎంపిక కోసం లిస్టులోకి వచ్చాడు. ఇంగ్లండ్‌కు చెందిన ప్రమాదకరమైన జట్టు భారత పర్యటనకు వస్తోంది. జనవరి 22 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఇరు దేశాల మధ్య ఈ టీ20 సిరీస్ జరగనుంది. టీ20 సిరీస్ తర్వాత రెండు దేశాల మధ్య మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది. ఇంగ్లండ్‌తో జరిగే ఈ వైట్ బాల్ సిరీస్‌లో వరుణ్ చక్రవర్తి తన మిస్టరీ స్పిన్ బౌలింగ్‌తో విధ్వంసం సృష్టించే ఛాన్స్ ఉంది. తమిళనాడుకు చెందిన స్పిన్ బౌలర్ వరుణ్ చక్రవర్తి 7 విధాలుగా బంతిని విసరగలడు. వీటిలో ఆఫ్‌బ్రేక్, లెగ్‌బ్రేక్, గూగ్లీ, క్యారమ్ బాల్, ఫ్లిప్పర్, టాప్‌స్పిన్, యార్కర్ ఆన్ టోస్ ఉన్నాయి. ఇప్పటి వరకు టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌ల్లో వరుణ్ చక్రవర్తి 13 మ్యాచ్‌ల్లో 19 వికెట్లు పడగొట్టాడు. అదే సమయంలో, అతను 70 ఐపీఎల్ మ్యాచ్‌లలో 83 వికెట్లను తన పేరిట కలిగి ఉన్నాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నమెంట్ కోసం లెగ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని కూడా భారత జట్టులో చేర్చవచ్చు అని అంటున్నారు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 టోర్నమెంట్ ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు జరుగుతుంది.



# బాలకృష్ణతో నటించడం అదృష్టం

## ప్రగ్య జైస్వాల్

'ఇందులో నా పేరు కావేరి. అభినయానికి ఆస్కారమున్న డీ గ్లామరస్ రోల్. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన పాత్ర. ఛాలెంజ్‌గా తీసుకొని చేశాను. దర్శకుడు బాబీ ఈ పాత్రను అద్భుతంగా డిజైన్ చేశారు.' అని కథానాయిక ప్రగ్య జైస్వాల్ తెలిపారు. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన చిత్రం 'డాకు మహారాజ్'. ఈ సినిమాలో వన్ ఆఫ్‌ది హీరోయిన్‌గా నటించింది ప్రగ్యా జైస్వాల్. సంక్రాంతి కానుకగా ఈ నెల 12న చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ప్రగ్యా విలేకరులతో ముచ్చటించింది. 'బాలకృష్ణగారితో వరుసగా సినిమా చేసే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా. 'అఖండ'తో నా కెరీర్ మలుపు తిరిగింది. ఇప్పుడు 'డాకు మహారాజ్' లాంటి గొప్ప సినిమాలో మళ్లీ ఆయనతో కలిసి నటించే భాగ్యం దొరికింది' అంటూ ఆనందం వెలిబుచ్చింది ప్రగ్య జైస్వాల్. దర్శకుడు బాబీ ఈ కథ చెప్పినప్పుడే పెద్ద హిట్ అవుతుందని నమ్మానని, నిర్మాత నాగవంశీ పాషన్‌తో సినిమా నిర్మించారని ప్రగ్య పేర్కొన్నారు. జనవరి 12 తన పుట్టినరోజు అని, అదేరోజు 'డాకు మహారాజ్' విడుదల అవుతుండటం సంతోషంగా ఉందని ప్రగ్యా జైస్వాల్ పేర్కొంది.



# బీచ్‌లో ఛిల్ అయిన అలియాభట్

గ్లామరస్ రోల్స్‌తోపాటు నటనకు ఆస్కారమున్న పాత్రలు చేస్తూ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారే భామల్లో టాప్‌లో ఉంటుంది బాలీవుడ్ హీరోయిన్ అలియాభట్. గతేడాది జిగ్రా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ భామ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉంది. కాగా ప్రొఫెషనల్‌గా బిజీగా ఉండే ఈ బ్యూటీ షూటింగ్ పనుల నుంచి బ్రేక్ తీసుకుంది. ప్రస్తుతం వెకేషన్ టూర్‌ను ఎంజాయ్ చేస్తోంది. ఈ భామ ఇంతకీ ఎక్కడికెళ్లిందో తెలుసా..? ప్రపంచ ప్రఖ్యాత టూరిజం స్పాట్స్‌లో ఒకటైన థాయ్‌లాండ్. బికినీలో థాయ్‌లాండ్ దీవుల్లోని సముద్రంలో జలకాలాడింది. సాగరతీరంలో విహరిస్తూ ప్రకృతిని అందాలను ఆస్వాదించింది. బ్లాక్ గాగుల్స్ పెట్టుకొని స్టైలిష్‌గా బోటు రైడ్ చేసింది. ఉదయాన్నే జిమ్ సెషన్‌కు వెళ్లింది. ఆ తర్వాత తనకిష్టమైన పుస్తకం చదివింది. అలియాభట్ థాయ్‌లాండ్ వెకేషన్‌లో సూపర్ ఛిల్ అవుట్ మూడ్‌లో ఉన్న ఫొటోలు ఇప్పుడు నెట్టింటిని షేక్ చేస్తున్నాయి. అలియాభట్ ప్రస్తుతం అల్ఫా, లవ్ అండ్ వార్ సినిమాల్లో నటిస్తుండగా.. చిత్రీకరణ దశలో ఉన్నాయి.




# బాలయ్యకు తగ్గని క్రేజ్

## గంటలోనే లక్షా 56వేలకుపైగా టికెట్స్ సేల్

నందమూరి బాలకృష్ణ కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం డాకు మహారాజ్. బాబీ దర్శకత్వంలో ఎన్‌బీకే 109గా తెరకెక్కుతున్న ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. డాకు మహారాజ్ జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. విడుదలకు ఇంకా రెండు రోజులే ఉండటంతో టికెట్ బుకింగ్ అప్‌డేట్ వచ్చేసింది. డాకు మహారాజ్ టికెట్ బుకింగ్స్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వ్యాప్తంగా థియేటర్లలో టికెట్ బుకింగ్స్ ఇవాళ మొదలయ్యాయి. పరిమిత షోలతో బుకింగ్స్ మొదలైన గంటలోనే లక్షా 56వేలకుపైగా టికెట్స్ సేల్ అయ్యాయి. బాలకృష్ణ సినిమాకు క్రేజ్ ఎలా ఉందో ఈ వార్త మరోసారి చెప్పేస్తుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు. రోనిత్ రాయ్, శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

# గేమ్ ఛేంజర్ బెనిఫిట్ షోలపై హైకోర్టు అసంతృప్తి




గేమ్ ఛేంజర్ టికెట్ రేట్లతో పాటు బెనిఫిట్ షోలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు నేడు విచారణ జరిగింది. పుష్ప 2 ది రూల్ సినిమాకు సంబంధించి సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన మరవకముందే మరో సినిమాకు బెనిఫిట్ షోలు అనుమతినివ్వడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. బెనిఫిట్ షోలు రద్దని చెప్పి మళ్లీ ప్రభుత్వమే అనుమతి ఇవ్వడం ఏంటి అని ప్రశ్నించింది. ప్రేక్షకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బెనిఫిట్ షోలకు అనుమతించొద్దని తెలిపింది. అంతేగాకుండా నిర్మాతలు భారీ బడ్జెట్‌తో సినిమాలు తీసి ప్రేక్షకుల నుంచి అన్యాయంగా వసులు చేయడం సరికాదని తెలిపింది. అలాగే అర్ధరాత్రి 1 గంటల తర్వాత సినిమా షోలకి పర్మిషన్ ఇవ్వడంపై పునఃసమీక్షించాలని కోరింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తను ఆదేశించింది. ఈ కేసుపై తదుపరి విచారణను జనవరి 24కి వాయిదా వేసింది.

# అమ్మో ఇమాన్వి..

## ప్రభాస్ హీరోయిన్ జోరు మామూలుగా లేదుగా..!

ఇమాన్వి.. ఇమాన్వి ఇస్మాయిల్.. ఈ పేరు గుర్తు పెట్టుకోండి.. రాబోయే రోజుల్లో ఎక్కువగా మాట్లాడుకోవాల్సి ఉంటుంది. ఎప్పుడొచ్చాం అన్నది కాదన్నయ్యా.. ఎంత స్పీడ్‌గా దూసుకుపోతున్నాం అనేది ఇంపార్టెంట్ అంటున్నారు ఈ జనరేషన్ హీరోయిన్లు. అందుకే ఒక్క సినిమా కూడా రిలీజ్ కాకుండానే అన్ని ఇండస్ట్రీల్లో రచ్చ చేయడానికి రెడీ అవుతున్నారు. మొన్నటికి మొన్న భాగ్యశ్రీ బోర్సే ఇదే చేసింది. మిస్టర్ బచ్చన్ డిజాస్టర్ అయినా కూడా ఈమెకు చేతినిండా ఆఫర్స్ ఉన్నాయి. దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ లాంటి క్రేజీ హీరోలతో నటిస్తుంది ఈ బ్యూటీ. తాజాగా మరో హీరోయిన్ కూడా ఇలాగే మాయ చేస్తుంది. ఆమెవరో కాదు.. ఇమాన్వి ఇస్మాయిల్.ఎవరీ అమ్మాయి ఎక్కడా పేరు కూడా విన్నట్లు లేదే అనుకుంటున్నారేమో..? అందుకే చెప్తున్నాం పేరు గుర్తు పెట్టుకోండి తర్వాత మాట్లాడుకునే పేరు అవుతుందని..! ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న సినిమాలో ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుంది. ఎక్కడో ఫారెన్‌లో రీల్స్ చేసుకునే ఈ అమ్మాయి అనుకోకుండా తన డ్యాన్స్ ట్యాలెంట్‌తో హను రాఘవపూడి కంట పడింది.. దాంతో దెబ్బకు జాతకం మారిపోయింది. ప్రస్తుతం ఫౌజీలో నటిస్తున్న ఈ బ్యూటీకి.. ఇది సెట్స్‌పై ఉండగానే మరిన్ని ఆఫర్స్ వస్తున్నాయి



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492